Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

**లీగల్ కౌన్సెలింగ్**

# అమ్మ రాసిన వీలునామాకు విలువే లేదా?



మేము ముగ్గురం అన్నదమ్ములం. నేను చివరివాణ్ని. మా ఇద్దరు అన్నయ్యల విద్యా, ఉద్యోగాలకోసం చేసిన ప్రయత్నాలకు ఉన్న వ్యవసాయ భూమి అంతా అమ్మేశారు. నా దాకా వచ్చేసరికి నన్ను చదివించే పరిస్థితి లేదు. చివరికి నేను ఒక బట్టల షాప్‌లో పనిచేస్తూ ఉండిపోయాను. ఇద్దరు అన్నయ్యలూ, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. సిటీలో సొంత ఇళ్లు కట్టుకుని సుఖంగా ఉన్నారు. నాకే ఏ ఆధారమూ లేకుండా పోయింది. ఈలోగా నాన్న చనిపోయారు. నాన్న స్వార్జితమైన ఇంటి స్థలాన్ని అమ్మ, 10 రూపాయల స్టాంప్ పేపర్ మీద నా పేరిట వీలునామా రాసి ఇచ్చింది. అలా రాసి ఇచ్చిన కొద్ది రోజులకే ఆమె చనిపోయింది. అయితే ఈ ఇంటికి సంబంధించిన అనుబంధపు సర్టిఫికెట్లన్నీ అమ్మ పేరునే ఉండిపోయాయి. ఇంటిపన్ను, కరెంట్ బిల్లులు కూడా అమ్మ పేరునే కొనసాగుతున్నాయి.

అయితే, ఇంటి స్థలం నాకు దక్కడం సహించలేని రెండో అన్నయ్య ఆ ఇంటిని కబ్జా చేశాడు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. కానీ, వాళ్లు పట్టించుకోలేదు. మరోసారి అడిగితే ఇది సివిల్ కేసు... అందువల్ల మీరు కోర్టులో తేల్చుకోవలసిందే అన్నారు. లాయర్‌కు ఫీజు చెల్లించేంతటి ఆర్థిక స్థోమత నాకు లేదు. అందుకే లీగల్ సెల్ అథారిటీకి, స్టేట్ సర్వీసెస్ అథారిటీకి పిటిషన్ పెట్టుకున్నా. అయినా ఫలితం లేకుండా పోయింది. ఆ తర్వాత జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను. అయినా నిరాశే మిగిలింది. అన్నయ్య రౌడీలను వెంటబెట్టుకుని వచ్చి నేను ఉంటున్న ఇంటిని కూల్చివేశాడు. ఇంటిపన్ను, నల్ల బిల్లు ఇప్పటికీ నేనే కడుతున్నాను. అయినా రిజిస్ట్రేషన్ ఆఫీసు వారు మాత్రం మాకు రిజిస్ట్రేషన్ చేయడం లేదు. అసలు ఈ భూమి రిజిస్ట్రేషన్ అయ్యే అవకాశం ఉందా... లేదా? అమ్మ నా పేరిట రాసిన వీలునామా ప్రకారం ఇల్లు నాకు దక్కే అవకాశం ఉంటుందా? ఈ వివరాలు తెలియచేయండి.

**- బి. ప్రకాశ్,** ఖమ్మం.

మీ అమ్మగారు తనకు పూర్తి యాజమాన్యపు హక్కులున్న ఇంటిని, మీకు చెందేవిధంగా వీలునామా రాసినట్లయితే, ఆ ఇంటిపై మీకు సంపూర్ణ యాజమాన్యపు హక్కులు సంక్రమిస్తాయి. అయితే, వీలునామా ఆధారంగా ఆ ఇంటిపైన యాజమాన్యపు హక్కులను కోరుతున్న వ్యక్తి సివిల్ న్యాయస్థానాన్ని సంప్రదించి ఆ ఇంటిని స్వాధీనపరుచుకోవలసి ఉంటుంది. కాకపోతే, ఆ వీలునామా రాసిన వ్యక్తి తనకు సంబంధించిన పూర్తి యాజమాన్యపు హక్కులున్న ఇంటిని మనస్ఫూర్తిగా దఖలు పరిచినట్లుగా కోర్టులో నిరూపించుకోవలసి ఉంటుంది.

వాస్తవానికి, ఇలాంటి ఫిర్యాదుల విషయంలో భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయని భావించినప్పుడు మాత్రమే పోలీసులు జోక్యం చేసుకుంటారు. అదేమీ లేకుండా ఇలాంటి సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోవడానికి పోలీసులకు చట్టపరమైన అధికారమేదీ ఉండదు. మీ పేరిట వీలునామా రాసిన ఆ ఇంటిని ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో మీ అన్నయ్య చేసిన దౌర్జన్యాల విషయమై మీరు కలెక్టర్‌తో పాటు, లీగల్‌సెల్ అథారిటీకి, స్టేట్ సర్వీసెస్ అథారిటీకి దరఖాస్తు పెట్టుకున్నా న్యాయం జరగలేదని తెలిపారు. మీ పేరిట ఉన్న వీలునామా ఆధారంగా సంబంధిత సివిల్ న్యాయస్థానంలో దావా వేస్తే, కోర్టు మిమ్మల్ని యజమానిగా గుర్తిస్తూ, ఆ ఆస్తిని మీకు స్వాధీనపరచమని ఆదేశించే అవకాశం ఉంది. కానీ, కోర్టుకు వెళ్లే ఆర్థిక స్థితి లేకపోవడం వల్లే, మీ జిల్లాలోని లీగల్ సెల్ అథారిటీని, స్టేట్ సర్వీసెస్ అథారిటీస్‌ను సంప్రదించారని అయినా ఫలితం లేదని రాశారు. అదే నిజమైతే, హైదరాబాద్‌లోని హైకోర్టు పరిధిలో ఉన్న తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదిస్తే, మీకు న్యాయం జరిగే అవకాశం ఉంది.



**● టి. ఎల్. నయన్ కుమార్**
న్యాయవాది, హైదరాబాద్